తాసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

అధికారులతో సమాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల, సెప్టెంబర్ 4 : జడ్చర్ల తాసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో చెరువులు, కుంటలు, పంటలకు నష్టం వాటిల్లిందా అనే విషయాలపై తాసీల్దార్, ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని యాసాయకుంట కట్ట తెగిపోయిందని, కట్టను వేయడం జరిగిందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. పెంగిండ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించాలని తాసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, తాసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో విజయకుమార్, నాయబ్ తాసీల్దార్ రాజీవ్‌రెడ్డి, తిరుపతయ్య, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తా

కాలిపోయిన ఇల్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

● ఎమ్మెల్యే జీఎంఆర్

మూసాపేట, సెప్టెంబర్ 4 : ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు, అండగా ఉంటానని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. మండలంలోని స్ఫూర్తితండాకు చెందిన మూడావత్‌కరే హమ్రియా నాయక్ ఇల్లు షార్ట్‌సర్క్యూట్ దగ్ధమైన విషయం తెలిసిందే. బుధవారం ఎమ్మెల్యే జీఎంఆర్ స్ఫూర్తితండాకు వెళ్లి కాలిపోయిన ఇల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధితులతో మాట్లాడుతూ అధైర్యపడొద్దని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని చెప్పారు. అదేవిధంగా వారికి ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యేవెంట తాసీల్దార్ బ్రహ్మంగౌడ్, మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

భూత్పూర్, సెప్టెంబర్ 4 : స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం ఎమ్మెల్యే ఇప్పలపల్లి, గాజులపేట గ్రామాలకు చెందిన 18మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు, నాయబ్ తాసీల్దార్ గీత, నాయకులు నవీన్‌గౌడ్, ఆనంద్, రవి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిని అలవర్చుకోవాలి

భూత్పూర్, సెప్టెంబర్ 4: సమాజంలో ప్రతిఒక్కరూ భక్తి భక్తిభావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మద్దిగట్ల గ్రామంలో కేశిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగింపుగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి హాజరై పల్లకీని మోశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవిత, మాజీఎంపీపీ కదిరేశేఖర్‌రెడ్డి, మంజుల, లక్ష్మీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

మక్తల్, సెప్టెంబర్ 4 : పనిఒత్తిడి కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఆశవర్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆశవర్కర్ల సంఘం సభ్యులు బుధవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. మక్తల్ మండలం కర్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జక్లేర్ ఆశావర్కర్ విధుల్లో భాగంగా పనిఒత్తిడి భారంతో ఆగస్టు 21వ తేదీ అర్ధరాత్రి వరకు రికార్డులు రాస్తూ కింద పడిపోగా, చికిత్సకోసం హైదరాబాద్ తీసుకెళ్లగా మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరాజు, పాల్గొన్నారు.

కూలిన ఇండ్ల వివరాలు సేకరించాలి

మక్తల్, సెప్టెంబర్ 4 : భారీ వర్షాలకు నేలమట్టమైన ఇండ్ల వివరాలను సేకరించి బాధితులకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే శ్రీహరి అధికారులను ఆదేశించారు. బుధవారం మారుతీనగర్, కేశవనగర్‌లో పర్యటించి కూలిపోయిన ఇండ్లను పరిశీలించి బాధితులకు భరోసా కల్పించారు. ఎమ్మెల్యేవెంట మున్సిపల్, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కుక్కలు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల, సెప్టెంబర్ 4 : జడ్చర్ల మున్సిపాలిటీలో కుక్కలు, దోమలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ (టీఆర్ఎస్ఎంఏ) నాయకులు కమిషనర్ రాజయ్యకు వినతి చేశారు. బుధవారం జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలకు రిసిన భారీవర్షాలకు దోమలు అధికంగా ఉన్నాయని దాంతో విద్యార్థులు, ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. అదేవిధంగా వీధికుక్కల బెడద అధికంగా ఉందని అవి పాఠశాలలకు వచ్చే విద్యార్థులను గాయపరుస్తున్నాయని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ప్రధానకార్యదర్శి నరేశ్‌కుమార్, కోశాధికారి విష్ణు, వాసుదేవోజీ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

నవాబ్‌పేట, సెప్టెంబర్ 4 : మండలంలోని చెన్నారెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 91 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎంఈవో రాజునాయక్ బుధవారం బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ వారు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం దశరథ్ నాయక్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీహరి, ఎచ్ఎం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ యాదయ్య, ఉపాధ్యాయులు రాములు, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331758

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

● నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

ధన్వాడ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ధన్వాడ, సెప్టెంబర్ 4 : సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సిక్తా పట్నాయక్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. విధులకు సిబ్బంది ఆలస్యంగా రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 9:30 గంటలైనా విధులకు హాజరు కాకపోతే ప్రజలకు ఎవరు వైద్యం అందించాల ని ప్రశ్నించారు. దవాఖానలో పరిసరాలు అపరిశుభ్రం గా ఉండడం, మూత్రశాలులు దారుణంగా ఉండడంపై వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో పర్యటించారు. పెద్దచెరువు నీళ్లు బయటకు వెళ్లేందుకు తీసిన గండిని పరిశీలించారు. పాతపల్లి నుంచి ధన్వాడకు వచ్చే విద్యార్థులు వాగు ఉధృతిలో కూడా నడవడాన్ని గమనించారు. విద్యార్థులను ప్రమాదకరంగా పంపించవద్దని తల్లిదండ్రులను కోరారు. వంతెన లేకపోవడంతో ఇప్పటికే ముగ్గురు మృతిచెందారని గ్రామస్తులు కలెక్టర్‌కు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు బ్రహ్మానందం, కిరణ్‌కుమార్, శివానంద్, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సాయిప్రకాశ్, తాసీల్దార్ సింధూజ, డాక్టర్ కీర్తిసాయి, ఆర్ఐ మల్లేశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 4 : ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో బుధవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితిని పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రతిఏడాది మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, రసాయనాలతో చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల చెరువులు కలుషితమవుతాయని, మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి చెరువులను సంరక్షించాలన్నారు.

ఉల్లిధర.. పైపైకి..

దేవరకద్ర, సెప్టెంబర్ 4 : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి ధరలు మరింత పెరిగిపోయాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో సాగుచేసిన ఉల్లి రైతులు విక్రయించేందుకు బుధవారం మార్కెట్‌కు తీసుకొచ్చారు. దాదాపు 15 క్వింటాళ్ల పైగా ఉల్లి విక్రయానికి వచ్చింది. దీంతో మార్కెట్‌లో స్థానిక వ్యాపారస్తులతో పాటు బయటి నుంచి వ్యాపారస్తులు వేలంలో పాల్గొన్నారు. గతవారం కంటే ఈ వారం ఉల్లిధర రూ.200 పెరిగింది. క్వింటాకు గరిష్ఠంగా రూ.4,500 ధర పలికింది. కనిష్ఠంగా కింట్వాకు రూ. 4,305 వరకు ధర వచ్చింది.

దాడులు చేయడం సిగ్గుచేటు

ధన్వాడ, సెప్టెంబర్ 4 : ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, అజయ్, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై కాంగ్రెస్ నాయకులు భౌతికదాడులు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు గౌని శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్నా పట్టింపులేకుండా నిర్లక్ష్యం వహించడం వల్లే ఎంతో మంది చనిపోయారన్నారు. భాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మల్లేశ్ గౌడ్, శివారెడ్డి, సునీల్‌రెడ్డి, శ్రీనివాసులు, భగవంత్‌రెడ్డి, వెంకటయ్య, బాలరాజ్ పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌గా విజయ

బాలానగర్, సెప్టెంబర్ 4 : బాలానగర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జహీరాబాద్ గురుకుల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె గతంలో బాలానగర్ బాలికల గురుకులంలో హిందీ (పీజీటీ) అధ్యాపకురాలిగా పనిచేశారు. బుధవారం బాలానగర్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఓటరు జాబితాపై సమావేశం

జడ్చర్ల, సెప్టెంబర్ 4 : ఓటరు జాబితాపై బుధవారం జడ్చర్ల తాసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాపై బీఎల్‌వోలు ప్రతిఇంటికీ వెళ్లి పూర్తి వివరాలు తీసుకోవాలన్నారు. సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కర్ అంటించాలన్నారు. అనంతరం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు.

గురుకుల సిబ్బందిని రోడ్డున పడేయడం సరికాదు

మాగనూర్, సెప్టెంబర్ 4 : రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న బోధనేతర సిబ్బంది 6వేల మందిని తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమైన చర్య అని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ ప్రకటనలో ఆరోపించారు. పాతవారిని తొలగించడంతోపాటు కొత్త సిబ్బందిని నియమించుకోవాలని ఉత్తర్వులు జారీ చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కొత్త నియామకాల్లో ఆర్‌సీవోలు చేతివాటం ప్రదర్శిస్తూ నిరుద్యోగుల నుంచి లక్షలు దండుకుంటున్నట్లు ఆరోపణలు

బాధిత కుటుంబాన్ని పరామర్శ

భూత్పూర్, సెప్టెంబర్ 4 : మండలంలోని మద్దిగట్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మెరుగు కృష్ణయ్య మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామానికి వెళ్లి మృత దేహానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, ఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, నర్సింహగౌడ్, సత్యనారాయణ, నర్సింహరెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవాబ్‌పేట, సెప్టెంబర్ 4 : పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జయరాంనాయక్ పేర్కొన్నారు. బుధవారం మండంలోని మరికల్ చిన్న మేఘ్యాతండా గ్రామపంచాయితీల్లో ఆయన పర్యటించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో బద్రూనాయక్, ఏపీవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపాలి

బైరంపల్లి రహదారి కోతకుగురై పడిన గుంతలు

మాగనూరు, సెప్టెంబర్ 4 : మండల పరిధిలోని పరమందొడ్డి, వడ్వాట్, అడవి సత్యారం, కొల్పూర్, మందిపల్లి, వర్కూర్, ఉజ్జెల్లి, బైరంపల్లి గ్రామాల ప్రధాన రహదారులు కోతలకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టి భవిష్యత్‌లోనూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అడవి సత్యారంలో కోతకు గురైన బీటీ రోడ్డు

కోతకు గురైన వర్కూర్ బీటీ రోడ్డు

గుంతలున్నాయి జాగ్రత్త..!

రోడ్డుపై ఏర్పడిన గుంత వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్

మరికల్, సెప్టెంబర్ 4 : మరికల్ నుంచి నారాయణపేటకు వెళ్లే రోడ్డు మండల కేంద్రంలోని మాతా మాణికేశ్వరిమాత ఆలయం సమీపంలో భారీ గుంత ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. నిత్యం ద్విచక్ర వాహనదారులు గాయాలపాలవుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పోలీసులు గుంత వద్ద బారికేడ్ ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

వరద కాల్వకు గండి..

● దెబ్బతింటున్న పంటలు
● ఆందోళనలో అన్నదాతలు

చౌటచెరువుకు గండిపడి వృథాగా వరిపొలాల్లోకి పోతున్న నీరు

మూసాపేట, సెప్టెంబర్ 4 : మూసాపేట చౌట చెరువుకు వరద వచ్చే ప్రధానకాల్వకు గండిపడింది. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని వాగునుంచి పాటు కాల్వను పూర్వం నవాబుల కాలంలోని గొలుసుకట్టు కాల్వను నిర్మించారు. వర్షానికి వచ్చే వరదనీరు ఆ కాల్వ ద్వారా రావడంవలన చెరువునిండడంతో పాటు దిగువన ఉన్న సంకలమద్ది, కొమిరెడ్డిపల్లి, అడ్డాకుల మండలంలోని పొన్నకల్, దుబ్బపల్లి, నాగాయిపల్లి, రాచాల గ్రామాల వరకు ఉన్న చెరువులగొలుసుకట్టు కాల్వలు ఉన్నాయి. కానీ చౌటచెరువుకు వరద వచ్చేకాల్వకు మండలంలో ని జానంపేట శివారులోని తాళ్ళగడ్డవద్ద గండిపడింది. దీంతో వరదనీరు వృథాగా పోయి పంటపొలాల వెంట వెళ్తుండడంతో వరిపంట పూర్తిగా కొట్టుకుపోతున్నట్లు స్థానిక రైతులు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వరదనీరు అంతా పరుగులు పెడుతుండడంతో బందాల నిండా మొత్తం ఇసుకమెట వేసి పూర్తిగా పంటకు పనికిరాకుండా పోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చెరువు వాగు వరద కాల్వకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతు చేసుకున్న కాలనీవాసులు

నీళ్లు వెళ్లకుండా పైప్‌లైన్ వేస్తున్న యువకులు

జడ్చర్ల, సెప్టెంబర్ 4 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సరస్వతీనగర్ కాలనీలోని అంతర్గతరోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు కలుగడంతో యువకులంతా కలిసి శ్రమదానంతోపాటు తలా కొంత డబ్బులు వేసుకుని రోడ్డుపై నుంచి నీళ్లు వెళ్లకుండా సిమెంట్‌పైపులు వేయించారు. అదేవిధంగా రోడ్డుకు మొర్రం మట్టిని తీసుకొచ్చి చదునుచేశారు. స్వచ్ఛందంగా పనులు చేసిన యువకులను కాలనీవాసులు అభినందించారు. కార్యక్రమంలో వాసుచారి, పవన్‌చారి, శివశంకర్‌చారి, రామకృష్ణాచారి, మహేశ్వర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, డేవిడ్, శివయ్య తదితరులు ఉన్నారు.

పేదల ఇండ్లు కూల్చడం సరికాదు

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 4 : మహబూబ్‌నగర్‌లో హైడ్రా పేరుతో ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చడం దారుణమని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రిస్టియన్‌పల్లి ఆదర్శకాలనీలోని సర్వే నెంబర్ 523లో బడుగు, బలహీన వర్గాలు కట్టుకున్న ఇండ్లను అక్రమ నిర్మాణం పేరిట ప్రభుత్వం కూల్చడం క్షమించరాని నేరంగా భావించాల్సి వస్తుందన్నారు. కూల్చినచోటే తిరిగి ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2002లో 523 సర్వేనెంబర్‌లో 83 ఎకరాలు ప్రభుత్వ భూమి కోసం పేదలు పోరాటం చేసి పట్టా సంపాదించి ఇల్లు నిర్మించుకుంటే అక్రమం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ పంపుహౌజ్ నీట మునిగిందన్నారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కో కన్వీనర్ తిమ్మప్ప, వెంకటేశ్వర్లు, తెలంగాణ ఫెడరేషన్‌ఆఫ్ ట్రేడ్ యునియన్ రాష్ట్ర కార్యదర్శి ఖలీల్, అధ్యక్షుడు విజయ్‌కుమార్, వామన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లపట్టాలు అమ్ముకున్నవారిపై చర్యలు..

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబరు 4 : దివ్యాంగులకు కేటాయించిన ఇండ్ల పట్టాలను కొందరు నాయకులు అమ్ముకున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఉదయ్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ విజయేందిర బోయికి బుధవారం ఫిర్యాదు చేశారు. 523 సర్వే నెంబరులో కొందరు గతంలో పనిచేసిన తాసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ చేసి పట్టాలు సృష్టించుకున్నారని, రెవెన్యూశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం ఇళ్లు నిర్మించుకున్నారని ఆరోపించారు.

14న ప్రకృతి ఆరోగ్యంపై అవగహన సదస్సు

మాట్లాడుతున్న గాంధీగ్లోబల్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్, సెప్టెంబర్ 4 : గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, సిద్ధార్థ యోగా విద్యాలయం, లయన్స్‌క్లబ్, పతంజలి యోగ సమితి, సిటిజన్ క్లబ్, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 14న నారాయణపేటలోని శ్రీరాఘవేంద్ర గార్డెన్‌లో ప్రకృతి ఆరోగ్యంపై అవగహన సదస్సు నిర్వహిస్తున్నట్లు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారావు సగరి తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ రాంకిషన్ ఆధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ కేవై రాంచందర్, డాక్టర్ పద్మ, గుండె వైద్య నిపుణులు దాసరి ప్రసాద్‌రావు, విజయ్, గాంధీ గ్లోబల్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి హాజరై ప్రసంగిస్తారన్నారు. మిల్లెట్స్ ఆహారం, రాగిజావ, కొర్రపాయసం ఉచితంగా వడ్డించడం జరుగుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, పతంజలి జిల్లా అధ్యక్షుడు సురేశ్, లయన్స్ గవర్నర్ హరినారాయణభట్టడ్, రెడ్‌క్రాస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి,మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్, ఆత్మరాం ఎడ్కే, వెంకోబ, రవిగౌడ్ పాల్గొన్నారు.

ప్రకృతిలో ప్రతి మొక్క ఔషధమే..

జడ్చర్ల, సెప్టెంబర్ 4 : ప్రకృతిలో ఉండే ప్రతి ఒక్క మొక్క ప్రజలకు ఔషధంగా ఉపయోగపడుతుందని జడ్చర్ల డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య తెలిపారు. బుధవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో ఔషధమొక్కల ప్రాముఖ్యత, ఔషధతయారీ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బృందాదేవి, శివకుమార్‌సింగ్ పాల్గొన్నారు.

డిగ్రీలో చేరేందుకు చివరి అవకాశం

నారాయణపేట, సెప్టెంబర్ 4 : డిగ్రీలో దోస్త్ ఫేస్-1, 2, 3 స్పెషల్ ఫేస్‌లో అడ్మిషన్ కాని విద్యార్థులు చివరి అవకాశంగా ఈనెల 9వ తేదీలోగా అడ్మిషన్ పొందాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ వసంత బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9959381382 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

జడ్చర్లలో..

జడ్చర్ల, సెప్టెంబర్ 4 : మండలంలోని మాచారం వద్ద గల గిరిజన బాలుర గురుకులలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా అడ్మిషన్ పొందాలన్నారు. అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సులో చేరేందుకు అభ్యర్థులు నేరుగా అడ్మిషన్‌పొందాలని సూచించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు మౌఖిక పరీక్షలు

నారాయణపేట, సెప్టెంబర్ 4 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 6వ తేదీన ఉదయం 10గంటలకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మెర్సీవసంత బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

**స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి